విద్యతోనే అభివృద్ధి

నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఉట్నూర్, ఫిబ్రవరి 20: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఉట్నూర్ ప్రిన్సిపాల్ పావని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే జీవితంలో స్థిరపడే అవకాశాలు ఏర్పడుతాయన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్‌రావు, సువర్ణ, వినోద్, లక్ష్మణ్, సుజాత, తిరుపతి, నవీన్, దశరథ్, కిశోర్, రూప, కళాశాల సిబ్బంది ప్రకాశ్, సాయికృష్ణ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

భూమి పూజ చేస్తున్న ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి

ఇచ్చోడ, ఫిబ్రవరి 20: కేశవపట్నం గ్రామంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ఆదేశానుసారం మంగళవారం రూ.8 లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులకు ఎంపీపీ నిమ్మల ప్రీతమ్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీటీసీ అల్తాఫ్ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డిని, ఎంపీడీవో ఎల్ లక్ష్మణ్‌ను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో షేక్ నజీర్, షేక్ జావిద్, షేక్ జుమ్మ, షేక్ అలీ, కార్యదర్శి సురేశ్, యువకులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం

ఎంపీడీవోను సన్మానిస్తున్న ఎంపీపీ గోవర్ధన్

జైనథ్, ఫిబ్రవరి 20 : జైనథ్‌కు బదిలీపై వచ్చిన ఎంపీడీవో రవీంద్రనాథ్‌ను మంగళవారం ఎంపీపీ గోవర్ధన్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో వెంకట్ రెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు దిలీప్, ముత్యంరావ్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో అయోధ్యరామ రథం

పూజలు చేస్తున్న గ్రామస్తులు

బోథ్, ఫిబ్రవరి 20 : అజ్జర్-వజ్జర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లెండిగూడ, మహదుగూడ, కేశవ్‌గూడ, నాగుగూడ, జైతుగూడ గ్రామాల్లో మంగళవారం అయోధ్య రాముని రథాన్ని ఊరేగించారు. గిరిజనులు సీతారాములు, లక్ష్మణుడికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మెస్రం భూమన్న, మెస్రం చిన్ను, పాండు, మెస్రం శేఖు పాల్గొన్నారు.

పిప్పల్‌కోటిలో బ్రహ్మోత్సవాలు

పూజలు చేస్తున్న భక్తులు

తాంసి(భీంపూర్), ఫిబ్రవరి 20 : భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ధ్వజారోహణం, హోమం, సంప్రదాయంగా నిర్వహించారు. ఈ నెల 22వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని గ్రామస్తులు తెలిపారు.

వలసలు నివారించడానికే ఉపాధి పనులు

కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో రజ్వీర్

నేరడిగొండ, ఫిబ్రవరి 20 : గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉపాధి హామీ పనులు చేపడుతుందని ఎంపీడీవో రజ్వీర్ అన్నారు. మంగళవారం నేరడిగొండలోని గుట్ట ప్రాంతంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాస్టర్‌లో నమోదు చేసిన వివరాలు పరిశీలించి కూలీల హాజరు శాతాన్ని పెంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీవో వసంత్‌రావ్, టెక్నికల్ అసిస్టెంట్ వినోద్, పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ లత, కూలీలు ఉన్నారు.

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా ప్రభుత్వ, ప్రైవేట్ కొలువుల్లో ఎలా రాణించాలో వివరించారు. కెరియర్ గైడెన్స్‌పై ప్లానింగ్‌తో ఉండాలని, అభ్యర్థులు అధైర్యపడకుండా లక్ష్యాల సాధనకు ముందుకు సాగాలని పలువురు వక్తలు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- బోరిగాంలో క్రీడల విజేతలకు బహుమతులు అందజేత

నేరడిగొండ: విజేతలకు బహుమతులు అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఫిబ్రవరి 20 : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్రీడలతో క్రీడాకారుల ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బోరిగాం గ్రామంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. యువత చదువుతో పాటు ఆటల్లో రాణించాలని సూచించారు. ముందుగా గ్రామంలోని సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లే నానక్‌సింగ్, క్రీడా నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

ఇచ్చోడ, ఫిబ్రవరి 20: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సాత్‌నంబర్ గ్రామంలోని సద్గురు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్, జగదాంబ దేవీ ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన యూత్ నాయకులు

బోథ్, ఫిబ్రవరి 20 : పట్నాపూర్ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని మంగళవారం యూత్ నాయకులు ఎమ్మెల్యే జాదవ్ అనిల్, ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎంపీ నగేశ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, గిరిజన మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి చాకటి దశరథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, చైతన్య యూత్ సెక్రటరీ ఆత్రం మోహన్, ఉపాధ్యక్షులు మడావి జంగ్‌రాజ్, సాయిదీపక్, సతీశ్, సంతోష్, వినిత్ కుమార్, దత్తు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలు ఎప్పుడు..?

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

నార్నూర్, ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో స్పష్టం చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో మంగళవారం ఆమె పర్యటించారు. గాదిగూడ రైతు వేదికలో 28, నార్నూర్ మండల పరిషత్ కార్యాలయంలో 51 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు జాడలేకుండా పోతుందని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే ప్రజలకు లబ్ధి చేకురుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం రాజుల్‌గూడ గ్రామంలో ప్రవీణ్ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆడ చంద్రకళారాజేశ్వర్, కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ మర్సువనే యోగేశ్, తహసీల్దార్లు జాడి రాజలింగం, విజయానందం, ఎంపీడీవోలు జవహర్, రామేశ్వర్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగోరావ్, మండలాధ్యక్షుడు మెస్రం హన్మంత్ రావ్, పూసం బాదిరావ్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ అందుకున్న లబ్ధిదారులతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి

ఎమ్మెల్యేను కలిసిన ప్రధాన్ సమాజ్ పెద్దలు

ఇంద్రవెల్లి: కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ నెల 26వ తేదీన ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే హీరాసుక జయంతి వేడుకలకు రావాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జూపటేల్‌కు ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ సమాజ్ పెద్దలు ఆహ్వానించారు. మంగళవారం ఉట్నూర్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి హీరాసుక జయంతి ప్రచార కరపత్రాలు ఎమ్మెల్యే చేతుల మీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు గేడం జ్ఞానేశ్వర్, మడావి విశ్వనాథ్, సోయం రాందాస్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ రూరల్ మండలం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, కోటేశ్వర్ మాట్లాడుతూ బాలికల రక్షణపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. చట్టాలు, హక్కులను తెలుసుకుంటూ మహిళా సాధికారతకు తోడ్పాటు అందించాలని సూచించారు. హెల్ప్ లైన్ నంబర్, బాల్య వివాహాలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి

అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు

జైనథ్, ఫిబ్రవరి 20: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ సాయన్న హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వారం రోజులుగా ఎస్ఆర్పీలు, డీఆర్పీలు గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ తనిఖీలపై అధికారులు, నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది గ్రామ పంచాయతీల వారీగా ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేయని కూలీలకు పని చేసినట్లు మాస్టర్లలో రాస్తే, ఈజీఎస్‌లో పంచాయతీ పనులు చేయకుండా చేసినట్లు ఉంటే వారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించడంతో పాటు తెలంగాణ గ్రామీణ క్రీడ ప్రాంగణాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. ఈజీఎస్ పనుల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దన్నారు. రాబోయే వేసవిలో కూలీల సంఖ్యను పెంచి ఉపాధి హామీ కింద వ్యవసాయ పనులు కల్పించాలన్నారు. ఈ ప్రజావేదిక కొనసాగుతోంది. కార్యక్రమంలో డీఆర్డీవో అదనపు పీడీ కుటుంబరావ్, ఎంపీపీ గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుంధతి వెంకట్ రెడ్డి, ఏపీడీ కృష్ణరావ్, హెచ్ఆర్ మేనేజర్ రషీద్, ఎస్టీఎం నరేందర్, మండల పరిషత్ అధికారి సాయినాథ్, అంబుస్ పర్సన్ వీణా, ఎంపీడీవో గజానన్‌రావ్, ఏపీవో వెంకటరమణ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షుడు జీవన్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ సాయన్న

సీటీవోగా బాధ్యతలు స్వీకరించిన నలిని మోహన్



నలిని మోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాణిజ్య పన్నుల శాఖ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : ఆదిలాబాద్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ (ఎఫ్ఏసీ)గా నలిని మోహన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న సీటీవో పీ శాంతకుమారిని హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో డీసీటీవోగా పని చేస్తున్న నలిని మోహన్‌కు సీటీవో(ఎఫ్ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు స్వీకరించిన నలిని మోహన్‌ను తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గజిటెడ్ ఉద్యోగుల సంఘం సభ్యులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం సీటీవో నలిని మోహన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అ సంఘం ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరికిషన్, సాయి కృష్ణ, అసోసియేటేడ్ ప్రెసిడెంట్ ఎంఏ అఖిల్, వైస్ ప్రెసిడెంట్ ఎస్‌కే ఫహీం, సయ్యద్ అజారుద్దీన్, సీహెచ్ నీత, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, జాయింట్ సెక్రటరీ ప్రవీణ, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

గిన్నిస్ రికార్డు నృత్య కళాకారులకు సన్మానం

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 20 : ఆదిలాబాద్‌లోని బాల కేంద్రం నిర్వాహకులు మిట్టు రవి శిష్యులు కూచిపూడి నృత్యంలో గిన్నిస్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో నృత్య కళాకారులను సన్మానించారు. డాక్టర్ ప్రియాంక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు మిట్టు రవి చిన్నారులకు జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అజీజ్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళాకారులను సన్మానిస్తున్న సొసైటీ అధ్యక్షుడు అజీజ్

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ఎదులాపురం, ఫిబ్రవరి 20 : రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మారెడ్డి, పడగంటి కిష్టయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌కు చెందిన శరత్ మాక్సి విజన్ కంటి దవాఖాన వైద్యులు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, పోలీస్ డిపార్ట్‌మెంట్ (ఆరోగ్య భద్రత కార్డు కలిగిన వారు), సింగరేణి ఉద్యోగులు, జర్నలిస్టులకు నగదు రహిత శస్త్రచికిత్స అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీ సేవలు, హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు కలిగిన వారికి చికిత్సలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వైద్య శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 9133900098, 9133900054 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన

బోథ్, ఫిబ్రవరి 20 : కుచులాపుర్ గ్రామంలో శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం భక్తులు శోభాయాత్ర చేపట్టారు. అమ్మవారి విగ్రహాన్ని ట్రాక్టర్‌లో వీధులగుండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఆశ్రమం వరకు విగ్రహాన్ని తీసుకెళ్లారు. బుధవారం హోమం, పూజాది కార్యక్రమాలు, గురువారం విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమానికి కౌర(బీ), కన్గుట్ట, బోథ్, తేజాపూర్, పిప్పిరి, బజార్‌హత్నూర్, గిర్నూర్ గ్రామాల నుంచి వందలాది భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధికి కృషి చేస్తా

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 20 : రత్నాపూర్ గ్రామాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని జడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మీ రాజేశ్వర్ అన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు వారిని శాలువాలతో సన్మానించారు. అనంతరం జడ్పీటీసీ మాట్లాడుతూ రూ.5 లక్షలు కమ్యూనిటీ హాల్, రూ.3 లక్షలు పోచమ్మ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం భాస్కర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, సింగిల్ విండో మాజీ చైర్మన్ ప్రకాశ్‌రావ్, ఎంపీటీసీలు మాధవ్, కమలాకర్, రమేశ్ రెడ్డి, సోమన్న, కోఆప్షన్‌సభ్యుడు బాబు ఖాన్, మాజీ సర్పంచ్‌లు గంగారం, రాంబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బోథ్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ఖరారు

బోథ్, ఫిబ్రవరి 20: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఖరారు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా బొడ్డు గంగయ్య (గంగారెడ్డి), వైస్ చైర్మన్‌గా ఆడె వసంత్‌రావ్, సభ్యులుగా మహ్మద్ ఇబ్రార్, ఇంద్రారెడ్డి, జాదవ్ రూప్లా, పాలెపు పోశెట్టి, జుంగాల పోతన్న, ఆర్క యాదవ్‌రావ్, పోరెడ్డి నారాయణ, ఉట్నూర్ నారాయణ్‌గౌడ్, నల్ల సవిత, రాయిసిడాం ఇస్రు, కత్తూరి విశ్వానంద్, కత్తూరి మల్లేశ్, చైర్మన్ పీఏసీఎస్ కుమారి, జిల్లా మార్కెటింగ్ చైర్మన్లను నియమిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

స్థిరమైన పనితనంతోనే అవార్డులు

అధికారులను సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్, ఫిబ్రవరి 20: ఎంపీడీవో తిరుమల, ఎంపీవో మహేశ్ స్థిరమైన పనితనం, ప్రకృతివనాల నిర్వహణతో ఉట్నూర్‌కు అవార్డులు పొందగలిగామని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ చట్టాలకు లోబడి ఎంపీడీవోగా తిరుమల విధులు విజయవంతంగా నిర్వహించిందని కొనియాడారు. ఉద్యోగులకు బదిలీలు సహజమన్నారు. అలాగే కొత్తగా వచ్చిన ఎంపీడీవో మురళీధర్ శర్మ, ఎంపీవో లింగయ్యను శాలువాలతో సన్మానించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో, ఎంపీవోలు మాట్లాడుతూ తమ విధులు నిర్వహించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, కోఆప్షన్ సభ్యుడు రషీద్, ఏపీవో రజినీకాంత్, ఈసీ విజేశ్, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఎంపీడీవో సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

ఉట్నూర్, ఫిబ్రవరి19: వైద్య సిబ్బంది చేసిన సేవలతోనే వారికి మంచి గుర్తింపు లభించిందని ఉట్నూర్ దవాఖాన సూపరింటెండెంట్ ఉపేందర్ అన్నారు. మంగళవారం జిల్లా దవాఖానలో ఉద్యోగాలు సాధించి వెళ్తున్న 17 మంది సిబ్బందికి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి అనేది సేవకు మారు పేరన్నారు. అటువంటి వృత్తిని ఎంచుకున్న సిబ్బంది రోగులకు మంచి సేవలు చేసి పేరు పొందాలన్నారు. ఈ దవాఖానలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహించి శాశ్వత ఉద్యోగులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు మహేందర్, రాథోడ్ కపిల్, నర్సింగ్ సూపరింటెండెంట్ విమల, సునీత, నర్సింగ్, పారామెడికల్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

సిబ్బందితో సూపరింటెండెంట్ ఉపేందర్

సేవాలాల్ జయంతికి తరలిన బంజారులు

నార్నూర్, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలకు నార్నూర్, గాదిగూడ మండలంలోని బంజారులు పెద్ద సంఖ్యలో మంగళవారం తరలివెళ్లారు. కార్యక్రమంలో బంజారా పెద్దలు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.

పట్నాపూర్‌లో వాలీబాల్ పోటీలు

బోథ్, ఫిబ్రవరి 20 : పట్నాపూర్ గ్రామంలో చైతన్య యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే జట్లు ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా రూ.400 చెల్లించి జట్ల పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 9381742229, 9603341339 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

హీరాసుక జయంతిని విజయవంతం చేయాలి

నార్నూర్, ఫిబ్రవరి 20 : ఇంద్రవెల్లి మార్కెట్ యార్డులో ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న హీరాసుక జయంతిని విజయవంతం చేయాలని ఉత్సవ కార్యనిర్వహణ కమిటీ అధ్యక్షుడు దుర్వా నగేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం గాదిగూడ మండలం ఝరి గ్రామ సమీపంలోని గేడం శంకర్ మహారాజ్ మఠంలో జయంతికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీన ప్రతి గ్రామంలో హీరాసుక జెండాలు ఆవిష్కరించాలన్నారు. ఇంద్రవెల్లిల్లో నిర్వహించే జయంతికి జిల్లా నలుమూల నుంచి పర్దాన్ సమాజ్ పెద్దలు, మేధావులు, ఆయా సంఘాల నాయకులు, యువతి, యువకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పెద్దలు జ్ఞానేశ్వర్, మడావి విశ్వనాథ్, సోయం రాందాస్, కొడప దేవ్‌రావ్, భరత్, ఆత్రం వామన్, యాదవ్‌రావ్, జైరామ్, సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 20 : తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ముద్రణ చేసిన క్యాలెండర్‌ను తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ సంఘం నాయకులతో కలిసి విడుదల చేశారు. గ్రామాల్లోని తాగునీటి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, మండలాధ్యక్షుడు కృష్ణ, వెట్టి గణేశ్ పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతరకు ఎమ్మెల్యే రాక

తాంసి(తలమడుగు), ఫిబ్రవరి 20 : తలమడుగు మండలం కజ్జర్ల గ్రామంలో బుధవారం నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ రానున్నారని వ్యక్తిగత సహాయకుడు అక్షయ్‌కుమార్ తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.